క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాంబూలం అందజేత



పరదేశిరెడ్డికి తాంబూలం అందజేస్తున్న సర్వేశ్వరరెడ్డి, ట్రస్టు సభ్యులు

సీతమ్మధార: మహాశివరాత్రిని పురస్కరించుకుని దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం వద్ద గురువారం సీరపు పరదేశిరెడ్డికి ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ట్రస్టు సభ్యులు తాంబూలం అందజేశారు. మహాశివరాత్రి పర్వదినాన చదునుపట్టు నుంచి అమ్మవారి ఊరేగింపు నిర్వహించే ముందుగా సంప్రదాయ ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చైర్మన్, ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

33వ వార్డులో ఫాగింగ్



కుమ్మర వీధిలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

అల్లిపురం: దోమల బెడద ఎక్కువగా ఉందని 33వ వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకు వార్డులోని అమ్మవారి వీధి, కుమ్మర వీధి, బంగారుమెట్ట తదితర ప్రాంతాల్లో గురువారం ఫాగింగ్ చేపట్టారు. దోమల నివారణకు వీధివీధికి జీవీఎంసీ మలేరియా సిబ్బంది వెళ్లి ఫాగింగ్ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు పాల శ్రీహరి రెడ్డి పర్యవేక్షించారు.

గోకుల్ థియేటర్ వద్ద గంజాయి కలకలం



సంఘటనా స్థలంలో పోలీస్ డాగ్‌తో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అల్లిపురం గోకుల్ థియేటర్ వద్ద ఒక బడ్డీ కింద గంజాయి ఉన్న సమాచారం స్థానికంగా కలకలం రేపింది. గురువారం ఉదయం డయల్ 100కు వచ్చిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు, డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. మయూరీ లాడ్జి ఎదురుగా ఒక బడ్డీ కింద సిమెంట్ బ్యాగ్ దొరికింది. దానిని పోలీస్ సిబ్బంది స్వాధీనం చేసుకుని అక్కడి నుంచి తరలించారు. దీనిపై టూటౌన్ పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎటువంటి సమాచారం లేదని తెలియజేశారు.

‘ఆరోగ్య సురక్ష’తో పేదలకు భరోసా

- 35వ వార్డులో 518 మందికి వైద్య పరీక్షలు



చిన్నారులకు మందులు అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది



ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు బీపీ పరీక్షలు చేస్తున్న సిబ్బంది



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సందేశ్

జగదాంబ: రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం పేదలకు భరోసాగా నిలుస్తోంది. గురువారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. కొంతమందికి మెరుగైన వైద్యం అవసరం కావడంతో కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. శిబిరంలో 518 మందిని పరీక్షించారు. వారిలో 140 మంది రోగులకు కంటి పరీక్షలు చేశామని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సందేశ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న రోగులు

మళ్లీ వైద్య పరీక్షలు చేయించుకున్నాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరానికి మళ్లీ వచ్చాం. ఇళ్లకు దగ్గరలోనే వైద్య శిబిరాలు నిర్వహించడంతో ఎవరి అవసరమూ లేకుండా స్వయంగా వచ్చి పరీక్షలు చేయించుకుని వెళ్తున్నాం. గతంలో ఇక్కడ వైద్య శిబిరం నిర్వహించినప్పుడు పరీక్షలు చేయించుకున్నాం. ఇలాంటి శిబిరాలు ఎప్పటికప్పుడు నిర్వహించడం వల్ల మాలాంటి వారికి ఎంతో ప్రయోజనకరంగా వుంటుంది.
– రామయ్యమ్మ, జీవీఎంసీ 35వ వార్డు.

ఆరోగ్యానికి భరోసా దక్కింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల మా ఆరోగ్యానికి భరోసా దక్కింది. గతంలో వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఇంటిలోనే వుండిపోయేవాళ్లం. ఇప్పుడు ఆ భయం లేదు. జగన్ బాబు నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ధైర్యం వచ్చింది. బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేయించుకోవాడానికి వచ్చాం. భవిష్యత్‌లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలి.
– లక్ష్మి, జీవీఎంసీ 35వ వార్డు

విశాఖ పీఠాధిపతిగా రెవరెండ్ ఫాదర్ జయరావ్



వేడుకల్లో పాల్గొన్న ఫాదర్ మల్లవరపు ప్రకాష్, ఫాదర్ పాలిమేర జయరావ్



నూతన పీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ జయరావ్‌ను సత్కరిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

- ఆర్చిబిషప్ మల్లవరపు ప్రకాష్‌కు ఘన వీడ్కోలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి మైదానంలో గురువారం విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో నూతన అపోస్టోలిక్ పాలనాధికారి విశాఖ పీఠాధిపతిగా రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పాలిమేర జయరావ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం వీధుల్లో మేళతాళాలతో అతిథులను వేడుకగా ఊరేగించారు. అనంతరం డాక్టర్ ప్రకాష్‌కు కృతజ్ఞత పూజాబలి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నల్గొండ బిషప్ రెవరెండ్ ఫాదర్ కరణం ధమన్‌కుమార్, ఫాదర్లు మల్లెల జోజి, జొన్నాడ జాన్‌ప్రకాష్, బాలశౌరీ, చిటికెల రాజకుమార్, ఆర్జీ ప్రకాష్, జోసెఫ్ ప్రభాకర్, సిస్టర్లు శాండ్రిస్, రోస్ జోస్ దివ్యబలి పూజలు చేశారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగడ్లు పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు వీడ్కోలు పలికి, నూతన బిషప్ జయరామ్‌కు స్వాగత పుష్పాలతో అభినందించారు, కార్యక్రమంలో పీపీసీ అధ్యక్షుడు రాజేష్, ఏఐసీయూ అధ్యక్షుడు బూర రవీంద్ర శేషుబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు వేయడంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీమ్మూర్తి

జగదాంబ: రానున్న ఎన్నికల్లో ఈవీఎంలపై ఓటు వేసే విధానాన్ని దక్షిణ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరామ్మూర్తి అవగాహన కల్పించారు. గురువారం ఆయన అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీవీవీడీ ప్రసాదరావుతో కలిసి 33వ వార్డులో మహిళలకు ఓటు వేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఈవీఎంలపై ఎటువంటి అపోహలు వద్దన్నారు. ఓటింగ్ స్థాయి పెంచాలన్నారు. ఇటీవల ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్ల కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. బీఎల్‌వోలు ఓటుపై మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చర్యలు



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు సూచనలిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

అల్లిపురం: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు నగర ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ సూచించారు. కమిషనరేట్ ఆవరణలో ఆయన నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో గురువారం ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్నా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్ చేసినా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు కేసులు వివరాలను తెలియజేయాలని చెప్పారు. తద్వారా నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు.

అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న చిన్నారి

- అండగా నిలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్



చిన్నారి జోయాను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక భరోసా కల్పించి అండగా నిలిచారు. 39వ వార్డు థామ్సన్ వీధికి చెందిన జోయా మహ్మద్ అనే ఆరేళ్ల చిన్నారి గుర్తు తెలియని వ్యాధితో బాధపడుతోంది. పాప వైద్యం కోసం.. ఉన్న ఆస్తులను అమ్ముకుని ఆస్పత్రికి కట్టారు. చివరికి చేసేది లేక వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆశ్రయించడంతో ఆయన గురువారం చిన్నారి ఇంటికి స్వయంగా వెళ్లి పరామర్శించారు. చిన్నారి దయనీయ పరిస్థితి చూసి చలించిపోయారు. దీంతో ఆయన తక్షణమే రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారికి అవసరమైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. చిన్నారి బ్రెయిన్ ఎదుగుదల లేక, కళ్లు కనిపించక అనుభవిస్తున్న నరకయాతన ఆవేదనకు గురిచేస్తోందన్నారు. తప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, కనకమహలక్ష్మీ దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, స్టేట్ డైరెక్టర్ సబీరా బేగం, దక్షిణ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, వార్డు ముస్లిం నాయకులు ఖాజావల్లి, రఫీ, షబ్బీర్, అనీష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్



ద్విచక్రవాహనాల దొంగతో పోలీసులు

దాబాగార్డెన్స్: కేజీహెచ్ పరిసర ప్రాంతాల్లో కొంత కాలంగా పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇప్పటికే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు పలు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో వన్‌టౌన్ క్రైం ఎస్ఐ ఎస్.రామ్మూర్తి నిఘా పెట్టారు. గురువారం కేజీహెచ్ కార్డియాలజీ విభాగం వద్ద టూ వీలర్ దొంగలిస్తుండగా ఓ వ్యక్తిని పట్టుకున్నారు. వన్‌టౌన్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. కేజీహెచ్‌లో 5 టూ వీలర్స్, మల్కాపురం పరిధిలో మరో రెండు ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసినట్టు గోపాలపట్నానికి చెందిన పి.సురేష్ అంగీకరించాడని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. హార్బర్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామని తెలిపారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం సేవా కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. ఓమ్ని హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బందితోపాటు సుమారు 120 మంది భక్తులు పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుకు పురస్కారాలు



ద్వారకా తిరుమలరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: సంక్రాంతి పండగ వేళల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ – 1 డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు, విజయనగరం డీపీటీవో సీహెచ్ అప్పలనారాయణకు ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ సీహెచ్ ద్వారకాతిరుమలరావు గురువారం ప్రశంసపత్రాలతోపాటు నగదు పురస్కారాలు విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో అందజేశారు. వీరితో మరికొందరు అధికారులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్స్, రీజినల్ మేనేజర్లు పాల్గొన్నారు.

భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం

సీతంపేట: నటరాజ నృత్య నికేతన్ నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ ఆధ్వర్యంలో గురువారం శంకరమఠం రోడ్డులోని పద్మశాలి భవనంలో నృత్య విద్యార్థులచే గజ్జపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం ఉట్టిపడుతుందన్నారు. కార్యక్రమంలో సన్‌మూర్తి, వెంకటేష్, కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, కల్యాణి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా చెత్త తరలిస్తే చర్యలు



రామ్‌నగర్ వద్ద క్లాప్ వాహనంలో చెత్త పరిశీలిస్తున్న జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు

జగదాంబ: జీవీఎంసీ క్లాప్ వాహనాల్లో అరకొరగా కాకుండా పూర్తి స్థాయిలో 600 కేజీలకు తక్కువ లేకుండా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని జోన్ – 4 జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు ఆదేశించారు. గురువారం ఆయన జోన్ పరిధిలోని 28వ వార్డులో పర్యటించి క్లాప్ వాహనాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లాప్ వాహనాలు ఉదయం ఆరు గంటలకే వార్డుల్లో ఇళ్ల ముందు వుంచాలన్నారు. ఆ వాహనాల్లో ఆరు వందల కేజీల కంటే తక్కువ చెత్తను తీసుకెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వార్డులోని కాలువలు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాలువలు, గెడ్డలు పరిశుభ్రంగా ఉంచాలని, రహదారుల పక్కన చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.

11 మందికి వాసుపల్లి సాయం



32వ వార్డులో వెంకటేశ్వరరావుకు నగదు అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



34వ వార్డులో బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

- రూ.53 వేలు అందజేత

అల్లిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నమ్మకంతో వారానికి 30 బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక భరోసా ఇవ్వగలుగుతున్నానని వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ప్రజాసేవలో భాగంగా గురువారం ఆయన 39వ వార్డు తామ్సన్ వీధికి చెందిన నాగేశ్వరరావుకు కళ్ల ఆపరేషన్ నిమిత్తం రూ.3 వేలు, 34వ వార్డు అచ్చియ్యమ్మపేటకు చెందిన మెరుగు అప్పారావు, కొబ్బరితోటకు చెందిన బర్నికాల రమణ, 33వ వార్డు వెంకటేశ్వర మెట్టకు చెందిన వాసపల్లి రవి, 32వ వార్డు పీలవారి వీధికి చెందిన పెంటకోట వెంకటేశ్వరరావు, 31వ వార్డు చాకలిపేటకు చెందిన ఊడిగ అనురాధ, 29వ వార్డు శ్రీ రంగాపురానికి చెందిన వెంపటి నూకరత్నం, 30వ వార్డు బెల్లం వినాయకుడు గుడి వీధికి చెందిన తెడ్డు పోలరాజు, కోడి పందాల వీధి, కుంచమాంబగుడి దగ్గర గల శివ మాధి, కొత్తజాలరిపేటకు చెందిన వాడమొదుల కల్యాణిలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వార్డు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సీతారామస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని అతి పురాతన ఆలయమైన కోదండ రామాలయం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 38వ వార్డు నాయకుడు సంకాబత్తుల సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు, బెహరా వెంకటరత్నం ఆధ్వర్యంలో ఆలయ ఈవో నీలిమ, ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్ సమక్షంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా కోసూరు వాసు, వల్లి శ్రీనివాసరావు, కాకి పద్మ, సనపల రోహిణి, టి.లక్ష్మి, సీల దేవిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి వెన్నుముకగా నిలిచే నలుగురు విశ్వబ్రాహ్మణులకి చైర్మన్ పదవులు ఇచ్చామన్నారు. జగన్నాథస్వామి ఆలయానికి మారోజు శ్రీనివాస్, ఎంబర్ మన్నార్ ఆలయానికి టేకి ప్రసాద్, గరుడ జగన్నాయకుల సత్రానికి కడియం ప్రసాద్, ప్రస్తుతం కోసూరు వాసులను చైర్మన్లుగా నియమించామన్నారు. భక్తులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఇక్కడి రామాలయ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. విశ్వబ్రాహ్మణులు అత్యధికంగా ఉండే ప్రాంతం కాబట్టి వారికే చైర్మన్‌గా అవకాశం ఇచ్చామన్నారు. పవిత్రమైన శ్రీరామాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులందరూ స్వామిని నిండు మనసుతో ఆరాధించి మరో 30 ఏళ్లు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకోవాలన్నారు. చైర్మన్ కోసూరి వాసు మాట్లాడుతూ ఇక్కడి విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలిచింది వాసుపల్లి మాత్రమే అన్నారు. ఎంతో మంది నాయకులను చూస్తున్నామని, వారిలో మంచి మనస్తత్వం గల ఎమ్మెల్యే వాసుపల్లేనని, పేదల ఇళ్లకు వెళ్లి సొంత నిధులతో సహాయమందించే గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో రవీంద్ర భరత్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన



సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: వలంటీర్ వ్యవస్థతో ప్రజల వద్దకు పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. అచ్చియ్యమ్మపేట పాఠశాలలో గురువారం సేవా వజ్ర అందుకున్న భూపేష్‌నగర్ వలంటీర్ లంకా దుర్గాభవాని, కొబ్బరితోట–1 వలంటీర్ తిమ్మారెడ్డి శంకరరావు, సేవారత్న అవార్డు గ్రహీత అచ్చియ్యమ్మపేట వలంటీర్ శంకర శివకుమార్, కొబ్బరితోట–1 వలంటీర్ గనిరెడ్డి విజయలక్ష్మిలను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శనీయంగా మారిందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలిచిన వలంటీర్లకు రుణపడి ఉంటామన్నారు. అంబేడ్కర్ కలలగన్న గవర్నన్స్ సీఎం వైఎస్ జగన్‌తో సాకారమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు వెంకటరావు, భవాని, రమ్య, సంతోష్, మహేష్, వెల్ఫేర్ సెక్రటరీలు రెహమాన్, రామ్‌జీ, వెంకటరామన్, రమీజ, వెంకటరమణ, రాజశేఖర్ పార్టీ నాయకులు లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉంటే జీవితం సుఖమయం



ప్లకార్డులు, కరపత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎం.రవిశంకర్ సూచించారు. మధురానగర్‌లోని జీవీఎంసీ పాఠశాలలో గురువారం హిమా హ్యూమానిటేరియన్, ఆదిత్య డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి స్నేహితులతో మంచి మార్గంలో నడిస్తే జీవితం సుఖమయంగా సాగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ అలవరచుకోవాలన్నారు. చెడు మార్గంలో నడిస్తే జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల యాజమాన్యం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సోషల్ వర్క్ స్టూడెంట్స్‌ను హిమా హ్యూమానిటేరియన్ సంస్థ సత్కరించింది. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఎస్ నాయుడు, సంస్థ గౌరవ అధ్యక్షుడు నరవ రాంబాబు, అధ్యక్షుడు డాక్టర్ శరగడం సురేష్, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ కడారి కుమార్, భాస్కర్, టీవీడీ దాస్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి హెడ్‌నర్స్ కుప్పిలి మణి, సుంకాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా పార్వతీశ్వరుల కల్యాణం

సీతంపేట: సీతంపేటలో కొలువైన పార్వతీశ్వరస్వామి 34వ వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈవో రమాభాయి పర్యవేక్షణలో శైవాగమ పండితులు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ నేతృత్వంలో వేద మంత్రాలు, మేళతాళాల మధ్య కల్యాణం కనుల పండువగా సాగింది. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలదండలతో చూడముచ్చటగా అలంకరించారు. సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని వీక్షించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అంకురార్పణ, ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మేళతాళాలతో స్వామి వారి సారె ఊరేగింపు అనంతరం ఏకాంత సేవ జరుగుతాయని అర్చకులు తెలిపారు.